నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం
13 మార్చి 2026



## దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో
# ఆశా వర్కర్ల వినతిపత్రం

**దుబ్బాక మార్చి 12 (నినాదం)**
సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆశా వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే పీఏ జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, NHMకు సరిపడా నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సిహెచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అయితే ఇప్పటికీ గ్యారెంటీ వేతనం, చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.1500 పారితోషికాన్ని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు, పీఆర్‌సీ ఎరియర్స్‌ను చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు శ్యామల, సంతోషి, శారద, స్వరూప, చంద్రకళ, నాగారాణి, లత, సుజాత, లక్ష్మి, భారతమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో
# వీక్షకులను ఆకట్టుకున్న పిల్లల ప్రతిభ



అల్వాల్, మార్చి 12 (నినాదం): అల్వాల్ నారాయణ పాఠశాలలో ఈ కిడ్స్ విద్యార్థులలో ఉన్న ప్రతిభ పరిశోధనను వెలికి తీయడానికి మరియు ఇది పిల్లలలో మాట్లాడే నైపుణ్యాలను ఆత్మ విశ్వాసాన్ని పంచుతుందని అల్వాల్ నారాయణ ప్రిన్సిపాల్ ఉమా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎండి హెడ్ అబేద, ఈ కిడ్స్ కోఆర్డినేటర్ అంబికా, వైస్ ప్రిన్సిపాల్ హరిత, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన మహిళా దినోత్సవ సంబరాలు

## భారీ సంఖ్యలో తరలి వచ్చిన మహిళాలోకం ...
## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. ఆలోచింపచేసిన ఉపన్యాసాలు







### మండలం లోని మార్పు ఇంటి నుండి మొదలు కావాలి
### ప్రత్యేక క్యాంపుల ద్వారా HPV వ్యాక్సిన్ పంపిణీ
### మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్: గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్ పూర్ , మార్చి 12, నినాదం:**
శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి ల ఆధ్వర్యంలో గురువారం జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. నియోజకవర్గ పరిధిలోని మహిళా ప్రజా ప్రతినిధులు, వేలాదిమంది మహిళలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రముఖులచే ఉపన్యాసాలు, బహుమతుల పంపిణీ కార్యక్రమాలు అందరిని ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఒక కుటుంబంలో మహిళా విద్యావంతురాలు అయితే ఒక తరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. సర్వైకల్ క్యాన్సర్ విముక్తి కోసం ప్రభుత్వం అందిస్తున్న HPV వ్యాక్సిన్ ను బాలికలతో మొదలు మహిళలందరూ వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన పక్షంలో పటాన్చెరు నియోజకవర్గంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి మహిళకు వ్యాక్సిన్ అందిస్తామని హామీ ఇచ్చారు. గత 25 సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆడ కూతురు ఉన్నత చదువులు చదువుకోవాలన్న సమున్నత లక్ష్యంతో పటాన్చెరు పట్టణంలో కేజీ నుండి పీజీ వరకు ఆధునిక వసతులతో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు వంటిల్లు నుండి అంతరిక్షం వరకు తమ సత్తా చాటుతున్న నేటికీ గృహ హింసకు గురి కావడం బాధాకరమన్నారు. మహిళల పట్ల మార్పు తమ గృహాల నుండే మొదలు కావాలని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళల ఆర్థిక సమృద్ధికి పెద్దపీట వేస్తూ వేల కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తు చేశారు. ప్రముఖ వైద్యులు, ఎమ్మెల్యే జిఎంఆర్ కోడలు గూడెం కిరణ్మయి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళా విజయం వెనుక ఎందరో మహిళల త్యాగం నెలకొని ఉందని తెలిపారు. మహిళ ఆర్థిక అభ్యున్నతి, ఉన్నత అవకాశాలు పొందాలంటే సంపూర్ణ సహకారం అందించాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కుటుంబానికి వెన్నెముకగా నిలిచే మహిళ తన ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం విధిగా ఆరోగ్య చికిత్సలు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న HPV వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలని కోరారు. అవసరమైన పక్షంలో జిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మహిళల పట్ల ఏ విధంగా ప్రవర్తించాలో బాల్యం నుండే అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం డాక్టర్ కవితా రెడ్డి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఆర్తి, ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి లు ప్రసంగించారు. మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## పెద్ద శివునూరులో ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై
# కార్యదర్శి ప్రశాంత్ సూచనలు

**చేగుంట మార్చి 12 (నినాదం)**
పెద్ద శివునూరు గ్రామంలో ప్లాస్టిక్ వాడడం వలన కలిగే నష్టాలు సూచనలు ఇస్తున్న కార్యదర్శి ప్రశాంత్తె లంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో బాగంగా చేగుంట మండలం చిన్న శివునూరు గ్రామంలో గురువారం నాడు గ్రామంలో గల వ్యాపారస్తులకు వ్యాపార నిర్వాహకులకు గ్రామంలో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పడి వేయడం కారణంగా ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రాణ వానికి కలిగే నష్టాలు పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ వివరించటం జరిగిందని అన్నారు అదేవిధంగా ప్రభుత్వం చేపట్టే 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని అందరి సహకారం ఉండాలని వివరించారు ఈకార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర నర్సింలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నం ఆంజనేయులు, ఎ ల్లం, బాలు గ్రామస్థులు పాల్గొన్నారు

## భార్యపై వేధింపుల కేసులో...
# భర్తకు రెండు సంవత్సరాల జైలు శిక్ష

**నల్లగొండ ప్రతినిధి మార్చి 12(నినాదం ):**
భార్యను వేధించిన కేసులో నిందితుడికి నల్గొండ ప్రత్యేక జెఎఫ్‌సీఎం (ప్రొహిబిషన్ & ఎక్సైజ్ నేరాలు) కోర్టు న్యాయమూర్తి రెండు సంవత్సరాల జైలు శిక్షని తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తెలిపారు.వివరాల్లోకి వెళ్తే, నల్గొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో 2015లో కేసులో గిరగాని వేణు (43), రామవరం గ్రామం, కొండకండ్ల మండలం, వరంగల్ జిల్లా నివాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భార్యపై వేధింపులకు పాల్పడినందుకు సెక్షన్ 498(A) కింద కేసు నమోదు చేసి కోర్టులో సరైన ఆధారాలతో ఛార్జ్ సీట్ దాఖలు చేయగా ఈ రోజు గౌరవ కోర్టు నిందితుడిని దోషిగా తేల్చింది. భార్యలపై వేధింపులు, కట్నం డిమాండ్లు వంటి కుటుంబ హింసా చర్యలు చట్టపరంగా తీవ్ర నేరాలని అన్నారు. కుటుంబంలో మహిళలపై గౌరవంతో వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.సమాజంలో మహిళలకు గౌరవం, భద్రత కల్పించడం ప్రతి కుటుంబం మ ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రజలకు సూచించారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీఓ ఎస్. మాధురి,అప్పటి దర్యాప్తు అధికారి నల్గొండ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ పి.సురేఖ, ప్రస్తుతం మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కర్ణాకర్ ఇన్‌స్పెక్టర్, సిడిఓ రమేష్ బాబు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ నరేందర్, మల్లికార్జున జిల్లా ఎస్పీ అభినందించారు.

# ముందుచూపుతో మూత్రపిండాలను కాపాడుకోవాలి






### డయాలసిస్, ట్రాన్స్ ప్లాంట్‌పై అపోహలతో ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు
### కామినేని ఆస్పత్రి ప్రముఖ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎ. సంతోష్ కుమార్

**ఎల్ బినగర్, మార్చి 12 (నినాదం)**
ముందుచూపుతో మూత్రపిండాలను కాపాడుకోవాలని, డయాలసిస్, ట్రాన్స్ప్లాంట్ పై అపోహలతో ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు అని కామినేని ఆస్పత్రి ప్రముఖ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎ. సంతోష్ కుమార్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం 'ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రిలో మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధుల నివారణ, ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతను సంబంధిత విభాగాల డాక్టర్లు వివరించారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ.. కామినేని ఆస్పత్రిలో డయాలసిస్ ద్వారా మెరుగుపడిన వారు, కిడ్నీ ట్రాన్స్ప్లాంటేషన్ చేసుకుని జీవితాలను సక్సెస్ఫుల్గా గడుపుతున్న 30 మందిని సదస్సుకు ఆహ్వానించారు. సదస్సులో వ్యాధికి ముందు.. చికిత్స అనంతరం డయాలసిస్, ట్రాన్స్ప్లాంటేషన్ తర్వాత వారు సమస్యను జయించిన తీరు, గడించిన అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. ఈ సందర్భంగా 'కామినేని' యాజమాన్యం వారు యుక్త వయస్సులోనే.. కిడ్నీ సంబంధిత సమస్యల బారిన పడి, ధైర్యంగా ఎదుర్కొని జీవితాన్ని చక్కగా సాగిస్తున్నవారికి 'యంగెస్ట్ ఫైటర్', అదే విధంగా పెద్ద వయస్సులోనూ కిడ్నీ సమస్యలు తీవ్రతరమైనా.. భయపడకుండా..ధృడ సంకల్పంతో ఎదుర్కొంటూ.. జీవితాన్ని లీడ్ చేస్తున్నవారికి 'ఐరన్ విల్' పేరుతో రెండు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కామినేని ఆస్పత్రి కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ ఎ. సంతోష్కుమార్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధుల నివారణ, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. 'కిడ్నీ సంబంధిత వ్యాధుల లక్షణాలు కనిపిస్తే.. ముందుగా సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. గాబరా పడి బీపీ షుగర్లు పెంచుకుని వ్యాధులను పెంచుకోవద్దు. ఇలా వ్యవహరిస్తే సగం వరకు వ్యాధులను నయం చేయవచ్చు. కిడ్నీ జబ్బులు, డయాలసిస్ అనగానే ఇక జీవితం అయిపోయినట్లుగా భావించొద్దు. అధునాతన చికిత్సల ద్వారా డయాలసిస్, ట్రాన్స్ప్లాంటేషన్తో విజయవంతంగా జీవితాన్ని గడపవచ్చు అని సూచించారు. అనంతరం కామినేని ఆస్పత్రి యూరాలజీ విభాగం డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ట్రాన్స్ప్లాంట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ వి. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. 'కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే మొదటి, సులభమైన మార్గం సరైన హైడ్రేషన్. అది సరిగా లేకపోతే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడుతాయి. రోజుకు కనీసం 2, 3 లీటర్ల నీళ్లు తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ బయటకు వెళ్లి కిడ్నీలపై భారం తగ్గుతుంది. కిడ్నీ స్టోన్స్ ఏర్పడే అవకాశం తగ్గుతుంది. ఒక వేళ కిడ్నీ వ్యాధుల బారిన పడినా భయపడాల్సిన పనిలేదు. తాజా డా విన్సీ రోబోట్ను ఉపయోగించి మినిమల్లీ ఇన్వాసివ్ సర్జికల్ టెక్నిక్లు.. మూత్రపిండాల నుంచి అత్యంత సంక్లిష్టమైన రాళ్లు, కణితులను కూడా తొలగించగలవు. ఈ విధానాలు చాలా ఖచ్చితమైనవి, నొప్పిలేకుండా ఉంటాయి. శస్త్రచికిత్స తర్వాత మరుసటి రోజే రోగి వారి సాధారణ జీవితానికి తిరిగి వెళ్ళవచ్చు. ఏదేమైనా మంచి అలవాట్లు కిడ్నీలను దీర్ఘకాలం కాపాడుతాయి' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అంజయ్య, ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, లాపరోస్కోపిక్, ట్రాన్స్ప్లాంట్ సర్జన్ డాక్టర్ వి. విష్ణువర్ధన్ రెడ్డి, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ సాయికాంత్ కుమార్, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సందీప్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి ఎస్సెస్సీ పరీక్షలు
### ఎం.ఈ.ఓ శంకర్ రాథోడ్



రాజేంద్రనగర్, మార్చి 12( నినాదం): మార్చి 14 నుండి ఎస్ ఎస్ సి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ మండలం ఎంఈఓ శంకర్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు 14వ తేదీ నుండి ఏప్రిల్ 16 వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాజేంద్రనగర్ మండలం పరిధిలో మొత్తం విద్యార్థులు: 5080 మంది ఉండగాప్రభుత్వ పాఠశాల విద్యార్థులు924,ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 4156, ఉన్నట్లు ఆయన తెలియజేశారు. పరీక్షా కేంద్రాల సంఖ్య 22,పర్యవేక్షణ సిబ్బంది22 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు,ఇన్విజిలేటర్లు: 264 మంది. పనిచేస్తారని ఆయన తెలియజేశారు. ముఖ్య సూచనలు:పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయని విద్యార్థులు పరీక్షా కేంద్రానికి కనీసం అరగంట ముందు హాల్ టికెట్ తోపాటు తప్పనిసరిగా ఉండాలని ఆయన తెలియజేశారు ఉంచుకోవాలి. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు సహకరించాలని ఆయన అన్నారు.

## ఎమ్మార్వో కార్యాలయంలో
# కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**అల్వాల్, మార్చి 12 (నినాదం):**
అల్వాల్ ఎమ్మార్వో కార్యాలయంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి నియోజకవర్గ శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన 23 మంది లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కళ్యాణ లక్ష్మి. షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయలేదని ఆయన విమర్శించారు. తులం బంగారం అందిస్తే పేద ప్రజలకు మరింత లాభం చేకూరుతుందని ప్రభుత్వం వెంటనే ఆ హామీని అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అల్వాల్ ఎమ్మార్వో రాములు, డిప్యూటీ తాసిల్దార్ పృథ్వి, రెవెన్యూ సిబ్బంది, మాజీ ఎంబీసీ చైర్మన్



నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, డిల్లి పరమేష్, శోభన్ బాబు, లక్ష్మణ్ యాదవ్, వెంకన్న, చిన్న యాదవ్, శ్రీధర్ గౌడ్, సంపత్ యాదవ్, శరణగిరి, భాస్కర్ రెడ్డి, అరవింద్, అరుణ్, పవన్, రేవంత్ రెడ్డి, శ్యామ్, మహేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలను
# పంపిణీ చేసిన కొలను హనుమంత రెడ్డి

**కుత్బుల్లాపూర్, మార్చి 12 (నినాదం)**
రంజాన్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు తోడ్పాటు అందించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈద్ కా తోఫా" (రంజాన్ కానుక) పథకం పంపిణీ కార్యక్రమం ప్రగతి నగర్‌లోని మసీద్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై మసీదుల ద్వారా అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఈద్ కా తోఫాలు (దుస్తులు, ఇతర నిత్యావసర వస్తువులు) పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ, రంజాన్ పండుగ సోదరభావం, సహనం, సేవా భావానికి ప్రతీక అని అన్నారు. అవసరమైన ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈద్ కా తోఫా పథకం వారికి ఎంతో



ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, మహమ్మద్ నబి , వాసు, మెడ శ్రీను, రమేష్, నారాయణ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, రఫియా బేగం, బికాంషా, సురేందర్ రెడ్డి, అరవింద్, రవీందర్, తులసి దాస్, ఆది రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, ఏ.వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో రంజాన్ నిర్వహించుకోవాలి

### కాటారం డిఎస్పి సూర్యనారాయణ

**మహాదేవపూర్ మార్చి 12, (నినాదం):**
శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగను నిర్వహించుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డిఎస్పి సూర్యనారాయణ అన్నారు. గురువారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని పండుగ సందర్భంగా ఎలాంటి హింసకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని తెలిపారు. ఎవరైనా కులం, మతం, వర్గాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా పోస్టులు లేదా సందేశాలు పంపినట్లు గుర్తించినట్లయితే వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తెలుసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతలు కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని అందరూ చట్టాలను గౌరవించి




సోషల్ మీడియా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్ కుమార్, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల పెద్దమనుషులు పాల్గొన్నారు.

# కొండయ్య మాస్టారి మరణం.... విద్యారంగానికి తీరని లోటు

### టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి

**జవహర్ నగర్, మార్చి 12 (నినాదం):**
కొండయ్య మాస్టారి మరణం విద్యా రంగానికి తీరని లోటు అని, ఆయన సేవలు జవహర్ నగర్, విద్యార్థులకే కాక జిల్లా విద్యారంగానికి తీరని లోటు అని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి పేర్కొన్నారు.మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ కొలకొండయ్య ఇటీవలే అకస్మాత్తుగా మరణించగా ఆయన జ్ఞాపకార్థం గురువారం సంస్మరణ కార్యక్రమ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు చావా రవి హాజరై మాట్లాడుతూ కొండయ్య మాస్టారు జీవితం అజరామరణమని క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయులుగా వారి



సేవలు స్లాగనీయమన్నారు నిరంతరం విద్యార్థుల శ్రేయస్సు గూర్చి ఆలోచిస్తూ విద్యా బోధనలో ముందుండే వారన్నారు. వారి అకస్మిక మరణం విద్యార్థులకు గాక పాఠశాలకు వారి కుటుంబానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చావా రవి కొండయ్య కుటుంబానికి ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ నుండి ఆరు లక్షల చెక్కును అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



అందించే వ్యవస్థ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు అజాముద్దీన్, టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయసింహారెడ్డి, మదన్ రెడ్డి, రాకేష్, వందన, రవి, కరుణాకర్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజేందర్ ,మల్లికార్జున్ రావు, ఉషారాణి ,వాసా కృష్ణ, మండల విద్యాధికారి నరసింహా, విద్యార్థులు, కొండయ్య మాస్టారు కుటుంబ సభ్యులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
శుక్రవారం 13 మార్చి 2026


## జిపి కార్మికులకు షూస్ పంపిణీ



**మహాదేవపూర్ మార్చి 13,(నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కుదురుపల్లి గ్రామ పంచాయితీ కార్మికులకు షూస్, చేతి గ్లౌవ్స్ లను 8వార్డు సభ్యుడు గోగుల నాగేందర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ సిబ్బంది గోగుల స్వామి, సౌన్నారి సమ్మక్క, రాజన్న, తదితరులు పాల్గోన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

**అమరచింత, మార్చి 12, (నినాదం):** ఆత్మకూరు మునిసిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సైదులు గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 246 మంది విద్యార్థులకు గాను 259 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది విద్యార్థులకు గైహాజరయ్యారు. వికాస్ జూనియర్ కళాశాలలో 166 మంది విద్యార్థులకు గాను 157 మంది విద్యార్థులు హాజరయ్యారు. 09 విద్యార్థులు పరీక్షకు గైహాజరయ్యారు. ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయని చీఫ్ ఎగ్జామినేషన్ అధికారి ప్రిన్సిపాల్, టి జె విశ్వేశ్వర్ లు తెలిపారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణకు సన్మానం



**మిర్యాలగూడ మార్చి12 (నినాదం ):** మిర్యాలగూడపట్టణంలోని షాబునగర్ 45 వ వార్డులో గురువారం ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక మున్సిపల్ కార్యక్రమంలో భాగంగా హాజరైన మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ కు బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ కుటుంబం, వార్డ్ సభ్యులతో శాలువాతో చిరు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డ్ కౌన్సిలర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, సామాజిక వేత్త పోలా యాదయ్య,ఆవుదారపు మురళిముదిరాజ్,ఉబ్బపల్లి కాశయ్య, బంటు విజయలక్ష్మి- వెంకటేశ్వర్లు ముదిరాజ్, నక్క పద్మ, ఖాజా,పోలా హైమావతి,దోనేటి ఆశోక్,కోలా రాంబాబు ముదిరాజ్, బంటు హన్మంత్,బంటు మేఘన తదితరులు పాల్గొన్నారు.

## దైవ భక్తితో మానసిక ప్రశాంతత



**చింతపల్లి, మార్చ్ 12 (నినాదం):** దైవభక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.మండల కేంద్రంలోని శ్రీ గట్టు లక్ష్మి మైసమ్మ మాత ఆలయ బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అమ్మవారి ఆశీస్సులు అందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయ పూజారి గండికోట చంద్రశేఖర్ ఎమ్మెల్యే బాలు నాయక్ ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ కురుమేడు గ్రామంలోని శ్రీ కాటమయ్య ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాసారపు శ్వేతా శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, తీదేడు గ్రామ మాజీ సర్పంచ్ కాయితీ జితేందర్ రెడ్డి, వార్డు సభ్యులు చెట్లపల్లి స్వాతి హరిప్రసాద్, వందనపు ఆంజనేయులు, కురుమేడు మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీశైలం, కాటమయ్య గుడి చైర్మన్ గౌని రవి గౌడ్,గ్రామ శాఖ అధ్యక్షుడు గోవింద్ రవి , కొప్పుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల కేంద్రంలో రంజాన్ తోఫా పంపిణీ

**చింతపల్లి, మార్చి 12 ( నినాదం) :** మండల కేంద్రంలో నేడు అధికారికంగా మండలంలోని ముస్లిం సోదరులందరికీ రంజాన్ పండుగ సందర్భంగా తోఫా అందించడానికి స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ రానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎండీ. రియాజ్ పాషా తెలిపారు. అదేవిధంగా సాయంత్రం 6.00 గంటలకు స్థానిక కమ్యూనిటీ హాలులో మండలంలోని అన్ని గ్రామాల ముస్లిం సోదరులందరికీ ఇఫ్తార్ విందును అధికారికంగా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండలంలోని ముస్లిం సోదరులందరూ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



**కమలాపూర్ మార్చి 12 (నినాదం)** కమలాపూర్ పశు వైద్యశాల పరిధిలోని కానిపర్తి గ్రామంలో గురువారం 48 పశువులకి ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు కమలాపూర్ పశు వైద్యాధికారి డా బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడిగుటి చేరాలు గారు, ఉప సర్పంచ్ జనగాని చారి,వెటర్నరీ అసిస్టెంట్ బాబు,సుమన్ , గట్టయ్య , గోపాల మిత్ర సిబ్బంది రాజేష్, సాదిక్, రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు అడ్డుకట్టవేసి
# యువత భవిష్యత్తు కాపాడాలి

**-డీఎస్పీ రవీందర్ రెడ్డి, నార్కోటిక్ డీఎస్పీ బి. రమేష్, అశ్వాపురం సీఐ జి. అశోక్ రెడ్డి**



**అశ్వాపురం, మార్చి 12 (నినాదం):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువత మరియు పిల్లలను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలనే లక్ష్యంతో గురువారం అశ్వాపురం మండల కేంద్రంలోని ఎస్కే టి ఫంక్షన్ హాల్లో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈగల్ ఫోర్స్ తెలంగాణ వారి సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, నార్కోటిక్ డీఎస్పీ బి. రమేష్, అశ్వాపురం సీఐ జి. అశోక్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, తహసీల్దార్ మణిధర్, అశ్వాపురం ఉపసర్పంచ్ తుళ్లూరి ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర వ్యసనమని తెలిపారు. సమాజం మొత్తం అప్రమత్తంగా ఉండి డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టేందుకు ముందుకు రావాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు మరియు యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉండేందుకు ప్రోత్సాహకంగా పోలీస్ శాఖ తరపున విద్యార్థులకు క్రీడా సామాగ్రిని కూడా అందజేశారు. ఈ క్రీడల ద్వారా యువత ఆరోగ్యంగా ఉండటంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉంటారని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అధికారులు వివరంగా అవగాహన కల్పించారు. సమాజంలో డ్రగ్స్ వ్యసనాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ అవగాహన సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఈగల్ ఫోర్స్ తెలంగాణ సభ్యులు, యువత, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

## బడి నిర్మాణానికి నిధులు కేటాయించండి : టిఆర్టిఎఫ్ డిమాండ్



**నిర్మల్ ప్రతినిధి,(నర్సాపూర్)మార్చి 12. (నినాదం):** నర్సాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గత రెండు సంవత్సరాల క్రితం నుండి మధ్యలోనే ఆగిపోయిన నూతన భవన బడి నిర్మాణానికి తగినన్ని నిధులు కేటాయించి , భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ౹=ఖీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్ గడ్డం భూమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రారంభమైన భవన నిర్మాణం నిధుల కొరతతో అర్ధాంతరంగా ఆగి పోవడం వలన నర్సాపూర్ ఉన్నత పాఠశాలలో తగిన తరగతి గదులు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు ఆరు వందల మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో, పదకొండు సెక్షన్లు నడపబడుతున్నాయని, విద్యార్థు లకు సరిపడా తరగతి గదులు లేక ఒక్కొక్క తరగతిలో 70 నుండి 80 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారని, ఇది విద్యార్థుల చదువులకు ఆటంకంగా మారుతుందని, విద్యార్థులు చదువుకోవడానికి సైన్స్ ల్యాబ్ ,కంప్యూటర్ ల్యాబ్, స్పోర్ట్స్ రూమ్, డైనింగ్ రూమ్ మొదలగునవి లేకపోవడం వల్ల విద్యార్థులకు మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన విద్యా విధానాన్ని అందించడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కావున ప్రభుత్వం ఇప్పటికైనా అక్కడి సమస్యను గుర్తించి భవన నిర్మాణానికి తగినన్ని నిధులు కేటాయించి అక్కడి భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకొని, విద్యార్థులు చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని వారు కోరారు. అదేవి ధంగా చుట్టుపక్కల గ్రామాల నుండి అనేక మంది విద్యార్థులు ఈ పాఠశాలకు చదువుకోడానికి వస్తున్నారని కావున నర్సాపూర్ మండల కేంద్రంగా ఒక బీసీ హాస్టల్ కూడా మంజూరు చేసే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకొని బడుగు బలహీన వర్గాల పిల్లల జీవితాలలో వెలుగులు నింపాలని ఈ అంశమై నూతనంగా వచ్చిన ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వానికి తగు ప్రాతినిధ్యం చేసి పాఠశాల భవన నిర్మాణాన్ని మరియు బీసీ హాస్టల్ మంజూరు విషయాన్ని పూర్తి చేసే విధంగా సహకరించాలని వారు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నుల పంపిణీ

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, మార్చి 12(నినాదం):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని పదవ తరగతి విద్యార్థులు ఉన్నత చదువుల వైపు ముందుకు సాగాలని ఉద్దేశంతో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాబాసాగర్ గ్రామంలోని హై స్కూల్లో గురువారం ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ చంద్రశేఖర్ జాడే (యూఎస్ఏ-ఎన్నారై) సహకారంతో ట్రస్ట్ అధ్యక్షుడు డి. సురేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ విద్య, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలను నిర్భయంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. మండల విద్యాధికారి పసల జయరాజ్ మాట్లాడుతూ పదవ తరగతిలో 10/10 జిపిఏ సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, యోగ మాస్టర్ విజయ్‌కుమార్, వినోద్‌కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



## పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు




**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, మార్చి 12(నినాదం):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరుగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీఛీూ2023) సెక్షన్ 163 అమలులో ఉంటుందని తెలిపారు.జిల్లాలోని 38 పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడడాన్ని నిషేధించారు. ఈ ఆంక్షలు మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు జరిగే ప్రతి రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అమల్లో ఉంటాయి. పరీక్షా కేంద్రాల సమీపంలో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమా దకర వస్తువులు తీసుకురావడం నిషేధం. పరీక్షల సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : ఎస్సై యుగంధర్

**వలిగొండ, మార్చి 12 (నినాదం):** మండల కేంద్రంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95 వ వర్ధంతి గోడపత్రికను గురువారం ఎస్సై యుగంధర్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై యుగంధర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, బెట్టింగ్ లకు దూరంగా ఉండాలని, యువత బెట్టింగ్లు, ఆన్లైన్ గేమ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని, యువత ఆన్లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా తమ విలువైన ప్రాణాలను శనికావేశంలో తీసుకుంటూ కుటుంబాలకు శోకాన్ని మిగిలిస్తున్నారని అన్నారు. బెట్టింగ్, ఆన్లైన్ గేమ్ లకు దూరంగా ఉండాలని, తమ విలువైన జీవితాన్ని కాపాడుకోవాలని యువతకు సూచించారు. అదేవిధంగా మహనీయుల ఆలోచన విధానాన్ని ఆదర్శం తీసుకొని యువత సమాజానికి సేవా దృక్పథం వైపు నడుచుకోవాలని యువతకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మారోజు నరసింహాచారి, గుండెగాని నాగరాజు, సలిగంజి కృష్ణ కుమార్, మెట్టు లక్ష్మణ్ నారాయణ, నరేష్, మధు తదితరులు పాల్గొన్నారు.




## సిర్పూర్ రేంజ్‌లో వన్యప్రాణుల సంరక్షణ పై మీడియా వర్క్‌షాప్



**కాగజ్ నగర్ మర్చి 12 (నినాదం) :** వన్యప్రాణుల సంరక్షణ వాటి ఆవాసాల పునరుద్ధరణపై అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించింది కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి డి ఎఫ్ ఓ నీరజ్ తీబ్రావాల్ నేతృత్వంలో సిర్పూర్ రేంజ్ లోని ఇటిక్యాల పహాడ్ అటవీ ప్రాంతంలో మీడియా ప్రతినిధులకు అవగాహన సదస్సు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడవిలోని మూగజీవాల కోసం తీసుకుంటున్న రక్షణ చర్యలను ఆయన వివరించారు ఎండలు మండుతున్న నేపథ్యంలో అడవిలోని వాగులు, వంకలు ఎండి పోకుండా వన్యప్రాణుల దాహం తీర్చడమే లక్ష్యంగా అటవీశాఖ సోలార్ బోర్లను ఏర్పాటు చేసింది కరెంట్ సౌకర్యం లేని దట్టమైన అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ ద్వారా మోటార్లు నడిపిస్తూ వన్యప్రాణుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన గుంతలలో నిరంతరం నీరు ఉండేలా చర్యలు చేపట్టారు. ఆవాసాల పునరుద్ధరణ కోసం జంతువులకు ఆహారం, రక్షణ లభించేలా అటవీ ఆవాసాలను సహజ పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నట్లు డి ఎఫ్ ఓ తెలిపారు వన్యప్రాణుల కదలికలను గమనిస్తూ, వేటగాళ్ల బారి నుండి వాటిని రక్షించేందుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నార వేసవిలో వన్యప్రాణులు నీటి కోసం జనావాసాల్లోకి రాకుండా అడవిలోనే అన్ని వసతులు కల్పించడం ద్వారా అటు జంతువులను, ఇటు ప్రజలను రక్షించవచ్చని ఈ కార్యక్రమంలో అధికారులు స్పష్టం చేశారు.

## బిజెపి రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్‌గా రావుల శేషగిరి నియామకం



**కుత్బుల్లాపూర్, మార్చి 12 (నినాదం):** బిజెపి రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్‌గా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి ని భారతీయ జనతా పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం నియమించారు. తనను రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ గా నియామకానికి అవకాశం ఇచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు కు రావుల శేషగిరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రావుల శేషగిరి మాట్లాడుతూ నన్ను ప్రోత్సహించి, మద్దతు ఇచ్చినందుకు పార్టీ పెద్దలందరికీ, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ నాపై నమ్మకంతో నాకు అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా పాటించి పార్టీ ఉన్నతికి, నాయకత్వానికి, నా శక్తి మేరకు న్యాయం చేస్తానని వివరించారు.

## 8 ఏళ్ల బాలుడి దవడలో అరుదైన క్యాన్సర్‌కు విజయవంతమైన శస్త్రచికిత్స




**కరీంనగర్, మార్చి 12 (నినాదం):** ఎనిమిదేళ్ల బాలుడి దవడలో ఏర్పడిన అరుదైన క్యాన్సర్‌ను హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా గుర్తించి చికిత్స అందించారు. గత రెండు నెలలుగా కుడివైపు దవడ వాపు, స్వల్ప నొప్పితో బాధపడుతున్న బాలుడిని పరీక్షించగా దవడపై సుమారు 4ఐ5 సెం.మీ పరిమాణంలో గట్టి వాపు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రాథమిక పరీక్షలు, బయాప్సీ నివేదికల ప్రకారం అది ప్రాణా పాయం లేని “ఒడోంటోజెనిక్ ఫైబ్రోమా” అనే అరుదైన కణితిగా తేలింది. అయితే యశోద ఆసుపత్రిలో వైద్య నిపుణుల బృందం మరింత లోతుగా పరిశీలించగా పరిస్థితి క్లిష్టంగా ఉన్నట్లు తెలిసింది. ఎంఆర్ఐ చిత్రీకరణలో కణితి కుడి దవడ ఎముకను దెబ్బతీసి పక్కనున్న కండరాల కణజాలానికి కూడా వ్యాపించినట్లు వెల్లడైంది. దీనిని పరిగణనలోకి తీసుకుని శస్త్రచికిత్స ద్వారా కుడి దవడలో ప్రభావిత భాగాన్ని తొలగించారు. అనంతరం కాలి ఎముక భాగాన్ని ఉపయోగించి దవడను పునర్నిర్మాణం చేసి ముఖ ఆకృతి, దవడ పనితీరు దెబ్బతినకుండా వైద్యులు జాగ్రత్తలు తీసుకున్నారు. తొలగించిన కణితిని సూక్ష్మ కణజాల పరీక్షకు పంపగా అది దవడ ఎముకలో ఏర్పడే అత్యంత అరుదైన దుష్ట స్వభావం గల క్యాన్సర్ అయిన “ఇంట్రా ఓసియస్ స్పిండిల్ సెల్ రాబ్డోమియోసార్కోమా”గా నిర్ధారణ అయింది. సాధారణంగా ఇది పిల్లల్లో మృదు కణజాలాల్లో కనిపించే క్యాన్సర్ కాగా, దవడ ఎముకలో రావడం చాలా అరుదని వైద్యులు తెలిపారు. యశోద ఆసుపత్రి సీనియర్ శస్త్ర క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ కె. శ్రీకాంత్ మాట్లాడుతూ, పిల్లల్లో దవడ కణితులు చాలా అరుదుగా కనిపిస్తాయని తెలిపారు. కొన్ని సందర్భాల్లో చిన్న నమూనా పరీక్షల్లో సాధారణ కణితుల్లా కనిపించే అవకాశముండటంతో లోతైన పరిశీలన, ఆధునిక చిత్రీకరణ పరీక్షలు, సమగ్ర కణజాల పరీక్షలు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. శస్త్రచికిత్స అనంతరం క్యాన్సర్ మళ్లీ రాకుండా ఉండేందుకు అవసరమైతే రసాయన చికిత్స, కిరణ చికిత్స అందించనున్నట్లు తెలిపారు. అరుదైన పిల్లల క్యాన్సర్లలో సరైన సమయంలో నిర్ధారణ, శస్త్ర వైద్యులు, పిల్లల క్యాన్సర్ నిపుణులు, కణజాల నిపుణులు, పునర్నిర్మాణ శస్త్ర వైద్యుల సమన్వయంతో చికిత్స అందిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన చెప్పారు. పిల్లల్లో దవడ వాపు తగ్గకపోవడం, వేగంగా పెరగడం లేదా నొప్పి కలగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణుల వద్ద పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విలేకరుల సమావేశం లో సత్యరెడ్డి, సుదీర్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.